సాక్షి
నల్లగొండ
ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



రథోత్సవంపై విహరిస్తూ..
యాదగిరిగుట్ట శ్రీపూర్వగిరి లక్ష్మీనారసింహుడి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారిని దివ్య విమాన రథంపై ఊరేగించారు. - 10లో



ఫ్యాషన్ విద్యార్థుల సందడి
కేరళకు చెందిన ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు పోచంపల్లి, దండుమ ల్కాపురంను సందర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
32°/15°
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

గొల్లగట్టు పిలుస్తోంది

నేటి నుంచి దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతర

- గంపల ప్రదక్షిణతో వేడుకలకు శ్రీకారం చుట్టనున్న నిర్వాహకులు
- రాత్రి కేసారం నుంచి రానున్న చౌడమ్మ తల్లి దేవరపెట్టె
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- తరలిరానున్న 20 లక్షల మంది భక్తులు



విద్యుత్ కాంతుల్లో పెద్దగట్టులోని శ్రీలింగమంతుల స్వామి దేవస్థానం

చివ్వెంల(సూర్యాపేట) : రెండేళ్ల కోసారి జరిగే పెద్ద గట్టు జాతరకు వేళయ్యింది. యాదవుల ఆరాధ్యదైవంగా భావించే చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి జాతరకు ఆదివారం గంపల ప్రదక్షిణతో శ్రీకారం చుట్టనున్నారు. ఇదే రోజు రాత్రి కేసారం గ్రామం నుంచి చౌడమ్మతల్లి దేవర పెట్టెను ఆలయానికి తీసుకువస్తారు. బోనాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరతో ఆ ప్రాంతమంతా గజ్జెల లాగుల గలగలలు.. భేరీ మోతలు.. కటారు విన్యాసాలు.. ఓలింగా.. ఓ లింగా నామస్మరణలతో సందడిగా మారనుంది. ఈ జాతర కోసం అధికారులు, దేవస్థానం కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా 20 లక్షల మంది భక్తులు తరలిరానున్నారు.

ఆలయం ముస్తాబు

అలయ కమిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీలింగమంతుల స్వామి ఆలయానికి రంగులు వేసి సంప్రోక్షణ గావించారు. మెట్లు, ప్రవేశ ద్వారానికి కూడా కలర్స్ వేశారు. ఇప్పటికే తలనీలాలు, టెంకాయల వేలాలు పూర్తి చేశారు. రవాణాకు బస్సు సౌకర్యం కల్పిస్తుండగా, తాగునీటి వసతి కల్పించడంతో పాటు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వెలిసిన దుకాణాలు..

జాతర వద్ద వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. వీటిలో ఆటవస్తువులు, కిరాణ షాపులు, స్వీట్ షాపులు ఉన్నాయి. జాతరకు ముందుగానే వచ్చిన భక్తులు సందడి చేస్తున్నారు.పిల్లలు ఆడుకునేందుకు జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్ తదితర ఆటవస్తువులు సైతం ఏర్పాటు చేశారు.



మకర తోరణంతో అలంకరించిన చౌడమ్మ, యలమంచమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాలు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జాతరలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతరను 8 జోన్లుగా విభజించారు. 7 ప్రాంతాల్లో శాశ్వత మరుగుదొడ్లు, 30 ప్రదేశాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా 60 తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు మూడు షిఫ్టుల ప్రకారం షిఫ్ట్‌కు 188 మంది చొప్పున మొత్తం 564 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో పాల్గొననున్నారు. అదే విధంగా షిఫ్టుకు 6 ట్రాక్టర్ల ద్వారా చెత్తా చెదారం తొలగించనున్నారు. వివిధ పనుల నిమిత్తం 48 మంది పంచాయతీ కార్యదర్శులను నియమించారు. పర్యవేక్షణకు 24 మంది జోనల్ అధికారులుగా జిల్లా పంచాయతీ రాజ్ శాఖ జిల్లాస్థాయి అధికారులను, అలాగే 16 మంది మున్సిపల్ జవాన్లు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 45 మంది సూపర్ వైజర్లను నియమించారు. రాత్రి పూట వెలుగులు విరజిమ్మేలా ఎల్ఈడీ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. 4 జనరేటర్లు కూడా అందుబాటులో ఉంచారు. ఆలయం వద్ద ఉన్న కోనేరును శుభ్రం చేయించారు.

జాతర ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దురాజ్‌పల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పెద్దగట్టు జాతర నిర్వహణపై శనివారం 'సాక్షి'తో కలెక్టర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. పెద్దగట్టు జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేశాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాం. గట్టు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించనున్నాం. గుట్ట చుట్టూ పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్త్ క్యాంపులు, హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశాం. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ సిబ్బందితో 24 గంటల బందోబస్తు ఏర్పాటు చేశాం. జాతరకు ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రొటోకాల్ అధికారులను నియమించాం. ప్రముఖులు దర్శనానికి వచ్చినప్పుడు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తాం.

జాతరను విజయవంతంగా నిర్వహిస్తాం : మంత్రి



భేరీలు మోగిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య, డీసీఎంఎస్ చైర్మన్ జానయ్య యాదవ్

సూర్యాపేట : పెద్ద గట్టు జాతరకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. జాతరలో భాగంగా తొలి ఘట్టమైన మకర తోరణం తరలింపు ప్రక్రియను శనివారం సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్ ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి భేరీలు మోగించి ఓ లింగా.. ఓ లింగా అంటూ సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజాన్ని క్రమపద్ధతిలో నడపడంలో ఆయా ప్రాంతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలను ఐక్యం చేయడంలో పెద్ద గట్టు వంటి జాతరలు దోహద పడుతాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ హయాంలో అన్ని కులాలు, మతాలకు సమ న్యాయం కల్పించామన్నారు. ఆదివారం రాత్రి కేసారం నుంచి దేవర పెట్టె తరలింపు అనంతరం సోమవారం నుంచి భక్తులు వస్తారని రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా 15 లక్షల మంది భక్తులు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు దేవస్థాన చైర్మన్ కోడి సైదులుతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

దక్కేదెంతో..?

రేపే రాష్ట్ర బడ్జెట్
- అత్యవసర పనులకైనా నిధులు వచ్చేనా..
- వచ్చే 9 నెలల్లోగా పూర్తి చేసే వాటిపై నీటిపారుదల శాఖ లెక్కలు
- ప్రాజెక్టులకు రూ.1200 కోట్లు తక్షణ అవసరమని అంచనా
- ఎంజీ యూనివర్సిటీకి రూ.40 కోట్లు కావాలని ప్రతిపాదన



కొనసాగుతున్న ఉదయసముద్రం కాల్వ పనులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు ఎంత మేరకు కేటాయింపులు ఉంటాయోనని చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, యూనివర్సిటీ, ఇతర పథకాలకు ప్రభుత్వం ఏ మేరకు నిధులను కేటాయిస్తుంది.. ఏయే ప్రాజెక్టులను పూర్తి చేస్తుందన్నది రేపు తేలనుంది. ఎన్నికల సంవత్సరంలో ఇదే చివరి బడ్జెట్ కావడంతో ఈసారైనా ప్రాజెక్టులకు పెద్ద మొత్తంలో నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కనీసంగా రూ.1250 కోట్లు కావాలని అధికారులు గతేడాది ప్రతిపాదించినా ప్రభుత్వం రూ.647 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈసారి కూడా కనీసంగా రూ.1200 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. డిండి లిఫ్ట్‌లో భాగంగా 90 శాతం వరకు పనులు పూర్తయిన సింగరాజుపల్లి, గొట్టిముక్కల రిజర్వాయర్లకు నిధులను ఎంతమేర కేటాయిస్తుందన్నది అస్పష్టంగానే ఉంది. డిండి విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు ఉండటం, అనుమతుల్లేకుండా కట్టారని ఇప్పటికే జరిమానా విధించిన నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తుందా? లేదా? చూడాలని అధికారులు పేర్కొంటున్నారు.

కొద్దిపాటి నిధులిస్తే పూర్తయ్యేవి ఇవే..

- డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా 0.81 టీఎంసీ సామర్థ్యం కళ్గిన సింగరాజుపల్లి రిజర్వాయర్‌కు ప్రభుత్వం రూ. రూ.110 కోట్లు కేటాయించింది. అందులో రూ.94 కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి కావడానికి దాదాపు రూ.23 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు.
- గొట్టిముక్కల వద్ద చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 1.83 టిఎంటీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు పనులు మరో 10 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. అందుకు రూ.10 కోట్లు అవసరం.
- నార్కట్ పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పనులు పూర్తయ్యాయి. మూడు నెలల్లో చెరువులోకి నీళ్ల ఎత్తిపోసేందుకు సిద్ధం చేస్తున్నారు. పంప్‌హౌజ్, టన్నెల్ పనులన్నీ పూర్తయ్యాయి. కాలువల పనులు కొనసాగుతున్నాయి. అవి పూర్తి కావాలంటే రూ.250 కోట్లు అవసరం. పిల్లాయపల్లి ధర్మారెడ్డి కాలువల పనులకు రూ. 85 కోట్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.
- కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు 25 శాతమే పూర్తయ్యాయి. మిగతా పనులను పూర్తి చేసేందుకు రూ.570 కోట్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు. అదనంగా భూ సేకరణకు రూ.100 కోట్లు, నిర్వాసితులకు గృహ నిర్మాణాలకు రూ.350 కోట్లు అవసరం.
- శివన్నగూడ రిజర్వాయర్ పనులకు రూ.1600 కోట్లు అవసరం కాగా, రూ.1100 కోట్లు విడుద ల చేశారు. మరో రూ.500 కోట్లు ఇవ్వాల్సి ఉంది.
- సీఎం మంజూరు చేసిన నెల్లికల్, ఇతర 14 ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో రూ. 500 కోట్లు అవసర మని అధికారులు చెబుతున్నారు.
- చండూరు మండలం పరిధిలోని శేషిలేటివాగు ఫీడర్ ఛానల్ పనులు భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వక పోవడంతో ఆగిపోయాయి. దానికి ఇప్పటికిప్పుడు రూ.10 కోట్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.
- నక్కలగండికి పెద్దమొత్తంలో నిధులు అవసరం ఉంది. అయితే ఇప్పటికిప్పుడు గేట్ల ఏర్పాటు పనులకు టెండర్లు పిలువాల్సి ఉంది. అందుకు రూ.200 కోట్లు అవసరం. మరోవైపు నక్కలగండి వెనుకవైపు ప్రత్యామ్నాయ రోడ్డు వేయాల్సి ఉందని, అందుకు నిధులు అవసరమని అధికారులు చెబుతున్నారు.
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేసేందుకు రూ.వేయి కోట్లు అవసరమని రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. బడ్జెట్‌లో ఏ మేరకు కేటాయిస్తుందో చూడాలి.
- ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్, మిగిలిన పనులకు రూ.300కోట్లు అవసరమని భావిస్తున్నారు.

యూనివర్సిటీకి రూ.40 కోట్లు కావాలి
మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రూ.40 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బాలురు, బాలికలకు మరో రెండు హాస్టల్ భవనాలను నిర్మించేందుకు రూ.20 కోట్లు కావాలని కోరింది. ప్రస్తుతం యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ భవనంలోనే పరిపాలన భవనం, పీజీ కాలేజీ, ఎంబీఏ కాలేజీ, ఆర్ట్స్ కాలేజీ, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆఫీస్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లతో కొత్తగా అడ్మినిస్ట్రేటివ్ భవనం కావాలని ప్రతిపాదించారు. అలాగే యూనివర్సిటీ గెస్ట్ హౌజ్ నిర్మాణానికి రూ.10 కోట్లు కావాలని ప్రతిపాదించారు.

◆ సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కాలువల ఆధునీకరణకు 450 కోట్ల రూపాయలతో రెండు సంవత్సరాల కిందట ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు పైసా ఇవ్వలేదు. ఈసారైనా బడ్జెట్‌లో కేటాయించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

82 మంది బాలలకు విముక్తి : ఎస్పీ

నల్లగొండ క్రైం: ఆపరేషన్ స్మైల్–9 కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 82 మంది బాలబాలికలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించామని జిల్లా ఎస్పీ అపూర్వరావు శనివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 82 మందికి విముక్తి కల్పించి, బాలలను పనుల్లో పెట్టుకున్న 72 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిరాదరణకు గురైన, వెట్టిచాకిరీకి గురవుతున్న, తప్పిపోయిన పిల్లల సమాచారాన్ని పోలీస్‌లకు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. బాలల స్వేచ్ఛకు, వికాసానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

28లోగా సీఎంఆర్ సేకరణ పూర్తి చేయాలి



మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ లింగస్వామి

నల్లగొండ: రబీ–2021–22 సీజన్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీఎంఆర్) సేకరణ ప్రక్రియను ఈనెల 28లోగా పూర్తి చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు మిల్లర్లను ఆదేశించారు. శనివారం నల్లగొండలోని గౌతమి రైస్‌మిల్లుతోపాటు పలు మిల్లులను ఆయన సందర్శించి మాట్లాడారు. గత రబీ సీజన్‌లో 3,27,653 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఇచ్చామని, సీఎంఆర్ కింద 2,18,341 మెట్రిక్ టన్నులను మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా్నారు. ఇప్పటివరకు 1,60,660 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్‌ఐ డి.లింగస్వామి ఉన్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు దరఖాస్తులు చేసుకోండి

నల్లగొండ: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతికి డేస్ స్కాలర్, 5వ తరగతికి రెసిడెన్షియల్‌తో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందించేందుకు ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ల యజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ సల్మాభాను శనివారం ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలు ఫిబ్రవరి 15లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

నేడు ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ: గ్రూప్ 2, 3, 4 ఉద్యోగ నోటిఫికేషన్‌కు సన్నద్ధమవుతూ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కల్పిస్తున్న ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు తమ కార్యాలయంలో ఆదివారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ : 8465035932, 9603167257 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అవగాహనతోనే వ్యాధుల నివారణ



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి తదితరులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): అవగాహనతోనే అన్ని రకాల వ్యాధులను నివారించవచ్చని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ) గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం యూనివర్సిటీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న జీవన శైలీ, ఆహారపు అలవాట్లు, వాతావరణలో చోటుచేసుకుంటున్న మార్పులే క్యాన్సర్‌కు కారకాలుగా ఉన్నట్లు పరిశోధకులు తేల్చారని తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, రవి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర, అన్నపూర్ణ, డాక్టర్ అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సీఓఈల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చిలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే బాల బాలికలు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ http// tgtwgurukulam. telangana. gov. inను సంప్రదించాలని కోరారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యకర జీవనం సాగించాలి

- రేపటి నుంచి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎన్సీడీ మందులు ఇస్తాం
- డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు

మిర్యాలగూడ: ప్రతిఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని డీఎంహెచ్‌ఓ అనిమళ్ల కొండల్‌రావు అన్నారు. శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటికే వివరాలు సేకరించిన 1.48 లక్షల మంది బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సోమవారం నుంచి వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నెలకు సరిపడా ఎన్సీడీ మందుల కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. మందులు అందజేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని జూన్ 30 వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,12,626 మంది ప్రజలకు కంటి పరీక్షలు చేశామని పేర్కొన్నారు. కంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ ఉచితంగా కళ్లద్దాలు పొందడంతోపాటు అవసరమైన వారు శస్త్ర చికిత్సలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్లు ఎస్.గీతావాణి, కె.జయ, డీఎంఓ రవిశంకర్, సీహెచ్‌ఓ శ్రీనివాసస్వామి, వెంకయ్య, ఎస్‌వీఓ వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను వ్యాపారంగా భావించొద్దు
మిర్యాలగూడ అర్బన్: ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యాన్ని వ్యాపారంగా భావించకుండా సేవా దృక్పథంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు అన్నారు. శనివారం మిర్యాలగూడలో పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీలు చేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఐదు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. తీరు మార్చుకోకుంటే ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

దేవరకొండ: దేవరకొండ డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకొండలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్లు, నీటి పారుదల శాఖ, సర్వే అధికారులతో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న నీటి పారుదల శాఖ పనులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణాలకు సంబంధించి పలు అంశాలపై ఆయన చర్చించారు. త్వరితగతిన భూ సేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలాల వారీగా భూ సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మండలాల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ లీల, డీఏఓ సంఘమిత్ర, నాంపల్లి, మర్రిగూడ మండలాల తహసీల్దార్లు, నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు తీపి కబురు!

- వేతనాలు పెంచుతూ జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెరిగిన గౌరవ వేతనం
- మొత్తం 2,609 మంది కార్మికులకు చేకూరనున్న లబ్ధి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడిస్తున్న కార్మికురాలు (ఫైల్)

నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెట్టే కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. ఇప్పటి వరకు వారికి నెలకు ఇస్తున్న రూ.వెయ్యి వేతనాన్ని రూ.3వేలకు పెంచుతూ జీఓ నంబర్ 8ని విడుదల చేసింది. దీంతో ఏళ్ల తరబడి తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2,609 మంది కార్మికులు
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం–2006 (పీఎం పోషణ పథకం)కింద వంట చేసేందుకు కార్మికులను నియమించిన ప్రభుత్వం అప్పట్లో వారికి నెలకు రూ.వెయ్యి గౌరవ వేతనం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 2,609 మంది వంట సహాయకులు పని చేస్తున్నారు. గతంలో వారి భోజనానికి సంబంధించి రేట్లు కూడా తక్కువగా ఉండడంతో పెంచిన విషయం తెలిసిందే. అయితే గౌరవ వేతనం మాత్రం పెంచలేదు. దీంతో పలుమార్లు వంట కార్మికులు రోజంతా పని చేయాల్సి వస్తోందని తమకు వేతనాలు పెంచాలని, లేదంటే వృత్తి నుంచి తప్పుకుంటామని ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చారు. అయినా ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనం పెంచకపోవడంతో ఇప్పటి వరకు 50 మందికిపైగానే పని మానేశారు.

ఎప్పటి నుంచి అమలులోకి వచ్చేనో!
ప్రస్తుతం ప్రభుత్వం ఎట్టకేలకు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచింది. 2006 నుంచి పని చేస్తున్నా ఇప్పటికే నెలకు రూ.వెయ్యి మాత్రమే ఇస్తున్నారు. అయితే వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కార్మికుల వేతనాలను రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు పెంచినట్లు తెలుస్తోంది. కానీ వేతనాల పెంపు అనేది ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్నది ప్రతిపాదనలో పేర్కొనలేదు. పాఠశాల విద్యాకార్యదర్శి అరుణ నుంచి జిల్లా శాఖకు తిరిగి ప్రతిపాదనలు వస్తేనే ఎప్పటినుంచి అమలవుతాయన్నది స్పష్టంగా తెలియనుంది. ఇదిలా ఉంటే కొందరు కార్మికులు మాత్రం ఊరట చెందుతున్నప్పటికీ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచితే బాగుండేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పోదాం.. పెద్దగట్టుకు

- దురాజ్‌పల్లి జాతరకు అంతా సిద్ధం
- నేటి నుంచి ఐదు రోజులపాటు వేడుక
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- సేవలందించనున్న వివిధ శాఖల అధికారులు

సూర్యాపేట క్రైం : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు వేళయింది. నేటి నుంచి ఐదు రోజులపాటు వేడుకలు అంగరంగ వైభవంగా సాగనున్నాయి. జాతరకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులను తరలించేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులతో పలు కమిటీలను ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రచించారు.


దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2000 మంది పోలీసుతో మూడు విడతల్లో బందోబస్తు ఉంటుంది. పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల మళ్లింపు చర్యలు, బారీకేడ్స్, పోలీసు కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్స్, క్యూ లైన్స్, సీసీటీవీ కెమెరాలను బిగించారు. ట్రాఫిక్ రెగ్యులేషన్ చేయడానికి చర్యలు తీసుకున్నారు. భక్తుల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు, పోలీసు కంట్రోల్ రూమ్, హెల్ప్ సెంటర్స్ ఏర్పాటు చేశారు. హెల్ప్ లైన్ సెంటర్స్ ద్వారా అత్యవసర సమయాల్లో పోలీసు వారి సేవలను వినియోగించుకోవచ్చు.

మూడు షిఫ్టులు.. 24గంటల పాటు..

2000 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారు. మూడు షిఫ్టులు, 24 గంటలు బందోబస్తు, బ్లూ కోట్స్, షీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్, మఫ్టీ టీమ్స్, స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీలు, పెట్రోకార్ సిబ్బంది, డాగ్ స్కార్డ్, బీడీ టీమ్స్, క్లూస్ టీమ్ విధుల్లో ఉంటారు. చెరువులోకి వెళ్లకుండా సైనేజ్ బోర్డ్స్, బారీకేడ్స్ ఏర్పాటు చేశారు. చెరువు వద్ద, కోనేరు వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్





జాతరలో ఏర్పాటు చేసిన హుండీలు

జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ ఇక్కడే..

జాతరకు వచ్చే భక్తుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

- **మొదటి పార్కింగ్ ప్రదేశం** : సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఎన్‌హెచ్ 65 మీద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటితండాకు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాలకు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- **రెండవ పార్కింగ్ ప్రదేశం** : గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి జాతరకు వచ్చే భక్తుల వాహనాలను కలెక్టరేట్ వెనుక గల స్థలంలో భారీ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- **మూడవ పార్కింగ్ ప్రదేశం** : కోదాడ, మునగాల వైపు నుంచి జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఖాసింపేట గ్రామం వెళ్లే మార్గంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- **నాలుగో పార్కింగ్ ప్రదేశం** : మోతె, చివ్వెంల మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్ తండా వద్ద (గట్టుకు వెనకాల) పార్కింగ్ స్థలం కేటాయించారు.
- **వీఐపీ పార్కింగ్** : జాతరకు వచ్చే వీఐపీల వాహనాల కోసం పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురు భాగంలో గల స్థలంలో పార్కింగ్ కేటాయించారు.

ట్రాఫిక్ సమస్య తొలగినట్లే..!

సూర్యాపేట, చివ్వెంల, సూర్యాపేట క్రైం : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరు పొందిన దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి జాతర ఈ సారి ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. 2007 వరకు మూడు రోజులు మాత్రమే జరిగిన ఈ జాతర, భక్తుల సంఖ్య దృష్టిలో పెట్టుకుని ఆ తర్వాత సంవత్సరం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. జాతర సమయంలో ట్రాఫిక్ నియంత్రిందుకు జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపులు చేపడతారు. ఈసారి జాతరలో ఇటీవల నిర్మాణమై వినియోగంలోకి వచ్చిన జాతీయ రహదారి 365బీబీని ఉపయోగించుకుంటున్నారు. దీని ద్వారా హైదరాబాద్, విజయవాడ మధ్య వాహనాలు స్వేచ్ఛగా వెళ్లే వీలుంటుంది.

వీఐపీ దర్శనం సింహద్వారం గుండా..

భక్తులకు దర్శనం కూడా సజావుగా అయ్యేలా పోలీస్‌శాఖ కసరత్తు చేస్తోంది. జాతరకు వచ్చే వీఐపీలను సింహద్వారం నుంచి గుట్ట పైకి పంపించి దర్శనం చేయించనున్నారు. అటువైపు భక్తులు తక్కువగా ఉంటారని.. వీఐపీల వాహనాలు కోనేరు వరకు వచ్చినా ట్రాఫిక్ సమస్య ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.



విద్యుత్‌కాంతుల మధ్య చెరువు



పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

బందోబస్తు విధులు పకడ్బందీగా నిర్వహించాలి



విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది



మర్రి చెట్టు వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్

చివ్వెంల (సూర్యాపేట) : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతరలో పోలీసులు పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వహించాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. బందోబస్తు విధుల నిర్వహణపై శనివారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ సిబ్బందికి ఎస్పీ తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వీరందరికీ దర్శించుకునే అవకాశం కల్పించాలని, ఏ ఒక్కరూ అసౌకర్యానికి గురికాకుండా విధులు నిర్వర్తించాలన్నారు. భక్తులు గుంపులుగా గుమికూడకుండా దర్శనం వరకు దారి చూపడం ముఖ్య విధి అని అన్నారు. భక్తులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జాతర విధులను ఇబ్బందిగా ఫీల్ కాకూడదని ఆనందంగా నిర్వర్తించాలన్నారు. సమస్యలు వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. షిఫ్టులవారీగా విధులకు హాజరు కావాలని ఏ ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించకూడదని, చక్కని యూనిఫామ్ ధరించి ఆదర్శంగా ఉండాలన్నారు. రిలీవర్ వచ్చే వరకు విధులు వదిలి వెళ్లవద్దన్నారు. పెద్దగట్టు ప్రాంగణం జాతీయ రహదారి 65పై ఉన్నందున వాహనాల మళ్లింపు, వాహనాల నియంత్రణ చాలా ముఖ్యమైన విధి అని పేర్కొన్నారు. వాహనాల మళ్లింపు ప్రదేశాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనదారులకు మార్గం చూపాలన్నారు. మళ్లింపు మార్గాల్లో సిబ్బంది నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని, వాహనాలు జామ్ కాకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలని, పునరుద్ధరించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు, వాహనదారులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. జాతర బందోబస్తులో సూర్యాపేట జిల్లాతో పాటు నల్లగొండ, వికారాబాద్, నాగర్ కర్నూల్, సంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. 8 మంది డీఎస్పీలు, 25మంది సీఐలు, 110 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, 250హెడ్ కానిస్టేబుళ్లు, 450 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 90మంది మహిళా కానిస్టేబుళ్లు, 300 మంది హోంగార్డులు, 10 స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీలు, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్, టీఎస్ఎస్‌పీ, స్పెషల్ బ్రాంచ్ టీమ్స్, వలంటీర్స్, షీటమ్స్, టెక్నికల్ టీమ్స్, సెక్యూరిటీ సర్వేలైన్ టీమ్, కమ్యూనికేషన్ సిబ్బంది జాతరలో విధులు నిర్వహిస్తారన్నారు.

కమిటీల నియామకం

సూర్యాపేట : జాతర విజయవంతానికిగాను అధికారులతో పలు విభాగాలకు కమిటీలు వేశారు. ఆయా కమిటీలకు చైర్మన్లను నియమించారు.

- **కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ** : కలెక్టర్, ఎస్పీ, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్, డీఎస్పీ సూర్యాపేట, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట.
- **ఫర్నిచర్ ఏర్పాటు కమిటీ** : పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, డీఎస్పీ, సూర్యాపేట, ఆర్ అండ్‌బీ ఈ ఈ, పీఆర్ ఈఈ, పీహెచ్ ఈఈ, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట, ఆర్డీఓ సూర్యాపేట, అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయశాఖ, ఈఓ దేవాదాయ శాఖ.
- **పారిశుద్ధ్యం నిర్వహణ కమిటీ** : పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట, డీపీఓ, ఈఈ భగీరథ, ఈఈ మిషన్ భగీరథ ఇన్‌ట్రా, గ్రిడ్, ఆర్డీఓ.
- **జాతర సెలబ్రేషన్ కమిటీ** : కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి, పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, డీఎస్పీ, సూర్యాపేట, డీఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట, డీఈఓ.
- **ఫుడ్ కమిటీ** : డీఎస్ఓ, జిల్లా మేనేజర్ సీఎస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఈఓ టెంపుల్.



లింగమంతుల స్వామి ఆలయం

జాతరకు 25 ఎకరాల స్థల సేకరణ

చివ్వెంల (సూర్యాపేట) : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో భక్తులు రద్దీ దృష్ట్యా అధికారులు రైతుల వద్ద నుంచి వ్యవసాయ భూమి సేకరించారు. గట్టుకు నలువైపుల 25 ఎకరాల స్థలాన్ని సేకరించి జాతర నిర్వహణకు ఖాళీ స్థలంగా ఉంచారు. సుమారు 33 మంది రైతుల వద్ద నుంచి భూములను సేకరించారు. ఒక్కో ఎకరానికి రూ.25 వేల చొప్పున రైతులకు చెల్లించారు. కాగా గుట్టకు పడమర వైపు చెరువు కట్ట పక్కన ఉన్న సుమారు 3 ఎకరాల స్థలంలో ఊటనీరు నిలవడంతో భక్తులకు అసౌకర్యంగా ఉంది. దీంతో అధికారులు ఆ స్థలానికి చెల్లించిన పరిహారం నష్టపోవాల్సి వచ్చింది.



రైతుల వద్ద నుంచి సేకరించిన వ్యవసాయ భూమి

లింగమంతుల సేవలో ఆర్టీసీ

భానుపురి (సూర్యాపేట) : పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతరకు ప్రయాణికులను చేరవేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రానుండడంతో ప్రత్యేక సర్వీసులను జాతరకు ఆర్టీసీ నడుపుతోంది. ప్రధానంగా సూర్యాపేట కేంద్రంగా జాతరకు బస్సులు నడపనున్నారు. అలాగే కోదాడ మిర్యాలగూడ డిపోల నుంచి ప్రయాణికులను జాతర వద్దకు తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సూర్యాపేట డిపో నుంచి 60 బస్సులు, కోదాడ నుంచి 20 బస్సులు, మిర్యాలగూడ డిపో నుంచి 8 బస్సులు జాతరకు ప్రయాణికులను చేరవేయనున్నాయి. జాతర వద్ద మూడు వైపులా బస్సుల కోసం స్థలాలను కేటాయించారు.

సూర్యాపేటలో ప్రత్యేక పాయింట్లు..

సూర్యాపేట నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు హాజరు కానున్నారు. దీంతో స్థానిక డిపో నుంచి 60 బస్సులను నడుపుతున్న అధికారులు పట్టణంలో ఐదు ప్రత్యేక పాయింట్లు గుర్తించారు. కొత్త బస్టాండు, కుడకుడ రోడ్డు, ఖమ్మం క్రాస్ రోడ్డు, పొట్టి శ్రీరాములు సెంటర్, పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని జాతరకు వెళ్లి తిరిగి ఆయా పాయింట్ల వద్ద దింపనున్నారు. ఈ పాయింట్ల వద్ద ప్రయాణికులను బస్సులో ఎక్కించేందుకుగాను సూర్యాపేటకు డిపోకు చెందిన 25 మంది సిబ్బందితో ప్రత్యేక వలంటీర్లను నియమించారు. అయితే జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేయొద్దని నిర్ణయించారు.



దుకాణాల వద్ద భక్తుల సందడి

ప్రొటోకాల్ అధికారుల నియామకం

సూర్యాపేట రూరల్/దురాజ్‌పల్లి /చివ్వెంల : ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పెద్ద గట్టు లింగమంతుల స్వామి జాతరకు వచ్చే వీవీఐపీ, వీఐపీలకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా చూసేందుకు తహసీల్దార్ క్యాడర్ ఉన్న అధికారులను ప్రొటోకాల్ అధికారులను నియమిస్తూ.. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నేటినుంచి ఈనెల 9వరకు జరిగే జాతరలో భాగంగా ప్రోటోకాల్ అధికారులు, సహా య సిబ్బందితో రోజు విడతల వారీగా విధులు నిర్వహించేలా కేటాయించారు.

తేదీ..	సమయం	అధికారులు
5న	6నుంచి2 వరకు	జె.కార్తీక్ (తహసీల్దార్)
5న	2 నుంచి 10 వరకు	హరిశ్చంద్రప్రసాద్ (తహసీల్దార్)
5న	రాత్రి 10 నుంచి ఉ..6 వరకు	సాయగౌడ్(తహసీల్దార్)
6న	ఉ.6 నుంచి మ.2 వరకు	రాంప్రసాద్(తహసీల్దార్)
6న	మ.2 నుంచి రాత్రి10	హ మీన్‌సింగ్‌రాంపతి(తహసీల్దార్)
6న	రాత్రి 10 నుంచి ఉ.6 వరకు	రమణారెడ్డి(తహసీల్దార్)
7న	ఉ.6 నుంచి మ.2 వరకు	యాదగిరిరెడ్డి(తహసీల్దార్)
7న	మ.2 నుంచి రా.10 వరకు	యాదగిరి (తహసీల్దార్)
7న	రాత్రి 10 నుంచి ఉ 6 వరకు	దామోదర్‌రావు (తహసీల్దార్)
8న	ఉ.6 నుంచి 2వరకు	శ్రీనివాసశర్మ(తహసీల్దార్)
8న	మ.2 నుంచిరా 10 వరకు	శ్రీదేవి (తహసీల్దార్)
8న	రా10 నుంచి ఉ 6 వరకు	కృష్ణ(తహసీల్దార్)
9న	ఉ.6 నుంచి మ.2 వరకు	నాగేశ్వరరావు(తహసీల్దార్)
9న	మ2నుంచి రా10 వరకు	సరిత(తహసీల్దార్)
9న	రా.10 నుంచి ఉ6 వరకు	వాజిద్‌అలీ(తహసీల్దార్)



మహిళల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయ్‌లెట్స్

నాణ్యమైన ప్రసాదం అందించాలి

సూర్యాపేట : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలని జిల్లా ఆహార భద్రత, తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తన బృందంతో పరిశీలించారు. ప్రసాదం తయారు చేసే పరిసరాల్లో ఈగలు వాలకుండా చూసుకోవాలని అన్నారు. తలకి, చేతులకు ప్రత్యేక గ్లౌజులు ధరించాలని , చేతుల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వీరి వెంట ఆహార తనిఖీ అధికారి కృష్ణమూర్తి, లతీఫ్ తదితరులు ఉన్నారు.



మర్రి చెట్టు కింద అధికారుల కంట్రోల్ రూమ్

పేదల మనిషి వర్ధెల్లి బుచ్చిరాములు





బుచ్చిరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బడుగు, బలహీన వర్గాల కోసం తుది శ్వాస వరకు పని చేసిన పేదల మనిషి వర్ధెల్లి బుచ్చిరాములు అని తొలి తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సీపీఎం సీనియర్ నాయకులు వర్ధెల్లి బుచ్చిరాములు 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి మరణం వరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాలపై పోరాటాలు చేసి బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి బాటలు వేసిన మహానాయకుడు అన్నారు. నేటితరం యువత బుచ్చిరాములుని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, గోళ్ల సోమిరెడ్డి, కిషన్‌నా యక్, నీలకంఠ చలమంద, తుంగతుర్తి మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, టీయుడబ్ల్యూ 143 జిల్లా అధ్యక్షుడు వజ్జే వీరయ్య, ముత్తిలింగం, అజిత్, చిత్రభద్రమ్మ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.